ఘనంగా రంజాన్ వేడుకలు

వేములవాడ/వేములవాడఅర్బన్/కోనరావుపేట/ఇల్లంతకుంట/ముస్తాబాద్/సిరిసిల్ల/రుద్రంగి/గంభీరావుపేట/బోయినపల్లి/ వీర్నపల్లి: సిరిసిల్ల,వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగ కుటుంబ సభ్యులతో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు పలువురు ప్రజాప్రతినిధులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ అన్వేష్, చైర్‌పర్సన్ మాధవి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ముస్లింకమిటీ నాయకులు హర్షం వ్యక్తంచేస్తూ ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పాలక వర్గానికి, అధికారులకు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

దుబాయ్‌లో రంజాన్ వేడుకలు

దుబాయ్‌లో ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎన్ఆర్ఐ రాధారపు సత్యం రంజాన్ వేడుకలను నిర్వహించుకున్నారు. అరబ్ వస్త్రాలంకరణతో మసీదుల్లో ప్రార్థనలుచేశారు. అక్కడి చిన్నారులకు స్వీట్లుపంచిపెట్టారు.


ఎల్లారెడ్డిపేటలో శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్


గంభీరావుపేట: మతపెద్దలకు ఈద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు


ముస్తాబాద్‌లో బోధనలు చేస్తున్న ముస్లిం గురువు


తడగొండ మసీదు వద్ద ఈద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న రుద్రంగి జెడ్పీటీసీ, నాయకులు

క్లుప్తంగా

చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: వేసవిదృష్ట్యా ప్రజల దాహం తీర్చేందుకు స్వచ్ఛందసంస్థలు ముందుకు వచ్చాయి. సిరిసిల్ల జిల్లాకేంద్రంలో శనివారం హిమాన్షి, కామాక్షి ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. పతంజలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, అగ్గిరాములు,డాక్టర్ సురేంద్రబాబు, పతంజలి సంరక్షకులు ఎలిగేటి కృష్ణ, గుడ్ల రవి, ప్రవీణ్‌పటేల్, ఆర్ఎస్ఎస్ కార్యవాహ కొండి సురేందర్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లత

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని 22వ వార్డులో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను కౌన్సిలర్ కల్లూరి లత శనివారం అందించారు. వార్డుకి చెందిన బద్దనపెల్లి హేమావతి, మహమ్మద్ సదాఫ్, సుల్తాన్ అశ్వినిలకు ఒక్కొక్కరికి రూ. 1,00,116ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీచేశారు. బీఆర్ఎస్ నాయకులు కల్లూరి మధు,పంగరవి, రాజలింగం,లక్ష్మణ్, ఎల్లయ్య, ఉన్నారు

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండల గౌడ సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా గంట కార్తీక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పందిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కోల నారాయణగౌడ్, కదిరె అంజాగౌడ్, గౌరవ అధ్యక్షులుగా ముశికం దత్తాద్రి, కోశాధికారిగా సుధాకర్, ప్రచార కార్యదర్శిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా కొండ అంజాగౌడ్‌లు ఎన్నికయ్యారు.

వేసవి నేస్తాలు...కాటన్ వస్త్రాలు

- ఎండ నుంచి ఉపశమనమిస్తున్న కాటన్ దుస్తులు
- పెరుగుతున్న డిమాండ్

సిరిసిల్లఅర్బన్: భానుడి ప్రతాపం రోజురోజుకు పెరగడంతో ఎండలు మండుతున్నాయి. ప్రజలు పెరుగుతున్న వేడికి, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ నుంచి ఉపశమనాన్ని పొందడానికి ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వేడిని తట్టుకునేందుకు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు జనాలు కాటన్ వస్త్రాలు ధరిస్తున్నారు. వీటి స్వభావం చమటను పీల్చుకుని, చల్లదనాన్ని ఇచ్చే గుణాలు కలిగి ఉండడంతో వీటిని ధరించేందుకు జనాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కాటన్ వస్త్రాలు శరీరరక్షణ, అందంతో పాటు హుందాతనాన్ని పెంచుతాయి. దీంతో వేసవిలో జనాలు కాటన్ వస్త్రాలు, ఖాదీ వస్త్రాల వైపు మొగ్గు చూపడంతో వీటికి డిమాండ్ పెరిగింది.


పలురకాల మోడళ్లలో కాటన్ వస్త్రాలు

సండే స్పెషల్

ఉక్కపోత నుంచి ఉపశమనం..

సాధారణంగా పాలిస్టర్ వస్త్రాల కంటే కాటన్ వస్త్రాల్లో చెమటను పీల్చుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. అంతేగాక శరీరానికి చల్లదానిన్ని ఇస్తాయి. కాటన్ దుస్తులు పిల్లలు, పెద్దలు, మహిళలు అన్ని వయస్సుల వారికి పలు రకాల మోడళ్లలో లభిస్తున్నాయి. మహిళలకు ప్రత్యేక డిజైన్లలో చీరలు, నైటీలు, చుడీదార్స్‌తో పాటు కాటన్ రుమాల్స్, షెల్లాలు లభిస్తున్నాయి.


కాటన్ వస్త్రాలను కొనుగోలు చేస్తున్న వ్యక్తి



పెరుగుతున్న విక్రయాలు



ప్రజల అభిరుచులకు తగ్గట్టుగానే కాటన్‌వస్త్రాలు మార్కెట్‌లో పలురకాల మోడళ్లలో లభిస్తున్నాయి. వేసవిలో మాత్రం వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కాటన్ షర్ట్స్ రూ. 200 నుంచి మొదలు కొని లెనిన్ కాటన్ రూ.2వేలకు పైగా ధరలు ఉన్నాయి. మహిళల చీరలు రూ.300 నుంచి మోడల్‌ని బట్టి రూ.3వేల వరకు ధరల్లో లభిస్తున్నాయి. వివాహాలు, శుభకార్యాల్లో కూడా కాటన్ వస్త్రాలను ధరించేందుకు జనాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్, ఢిల్లీ, కోలకతా తదితర ప్రాంతాల నుంచి కాటన్ వస్త్రాలను తెచ్చి విక్రయిస్తున్నారు.

కాటన్ దుస్తులతో చల్లదనం



వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కాటన్ దుస్తులు ఎంతగానే తోడ్పడతాయి. కాటన్, ఖద్దర్ వస్త్రాలను ధరించడం వల్ల ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలుగుతుంది. పాలిస్టర్ కంటే కాటన్ వస్త్రాల్లో చెమటను పీల్చుకునే గుణం ఉండడంతో చల్లదనాన్ని ఇస్తాయి. రక్షణతో పాటు హుందాగా కనబడుతాయి.

శ్రీకాంత్, సిరిసిల్ల

చాలా రకాల్లో లభ్యం



ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా అనేక రకాల డిజైన్లలో కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉంచాం. ముంబై, ఢిల్లీ, భీవండి, తదితర పట్టణాల నుంచి నాణ్యతగల కాటన్ వస్త్రాలను తీసుకొస్తున్నాం. వివాహాలు, శుభ కార్యాల్లో కాటన్ వస్త్రాలను ధరించేందుకు జనాలు ఆసక్తి చూపిస్తున్నారు. వేసవిలో వీటి అమ్మకాలు మరింత రెట్టింపు అవుతాయి.

మంచాల విద్యాసాగర్, సిరిసిల్ల వ్యాపారి

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులకు భూమిపూజ

- రూ.9 కోట్ల నిధులతో పనులు
- ప్రారంభించిన జెడ్పీటీసీ, ఎంపీపీ, సెస్ చైర్మన్


మాట్లాడుతున్న జెడ్పీటీసీ పూర్మాని మంజుల

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధిచేస్తూ రూ.9 కోట్ల నిధులతో సుందరీకరణ పనులకు శనివారం జెడ్పీటీసీ పూర్మాని మంజుల, ఎంపీపీ పడిగెల మానస, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎంకేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మన ఊరు మన బడి పథకంలో విద్యా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారన్నారు సిరిసిల్ల జిల్లాపై ప్రత్యేక చొరవ చూపుతున్న సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వేణుగోపాలరావు, సర్పంచులు జక్కుల రవీందర్, ముడారి పోచయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, రామాగౌడ్,హెచ్‌ఎం గోవర్ధన్, ఉపాధ్యాయులు గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలి
- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తడగొండ, బోయినపల్లి, కొదురుపాక, అనంతపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని దేశాయిపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం, వెంకటాపూర్, బండలింగంపల్లి, కోరుట్లపేట, అగ్రహారం, సర్వాయిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రారంభించారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అనుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ మ్యాకల రవి, పీఏసీఎస్ చైర్మన్ బీరెడ్డి సల్మాన్ రెడ్డి ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


18 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు

సిరిసిల్లఅర్బన్: రూసో కళాశాలలో 2005–06 విద్యాసంవత్సరం బీఈడీ పూర్తిచేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగింది. 18 ఏళ్ల తర్వాత ఒకేవేదికపై అందరూ కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమతో విద్యనభ్యసించిన వారిని ఆదుకునేందుకు రూసో వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటుచేసుకున్నారు. ఒకరికొకరు అండగా నిలిచేందుకే ఈ సొసై టీని ఏర్పాటుచేసుకున్నట్లు పేర్కొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం

- జీపీ భవన నిర్మాణంలో జాప్యం
- కేటీఆర్ చేతులమీదుగా భూమిపూజ
- తట్టెడు మట్టి కూడా తీయని వైనం
- రూ.20 లక్షలు మంజూరైనా ఇంకా నిధులు కావాలంటూ కాలయాపన

తంగళ్లపల్లి: సాక్ష్యాత్తు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన పనులు కూడా తంగళ్లపల్లి మండలంలో ప్రారంభం కావడం లేదు. నిధుల కొరతనో లేదా నిర్లక్ష్యమో తెలియదు కానీ తంగళ్లపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 13 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం ఎక్కడవేసిన గొంగ లి అక్కడే అనే చందంగా మారాయి. 13 గ్రామపంచాయతీల్లో తంగళ్లపల్లి, గండిలచ్చపేట గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి స్వయంగా మంత్రి కేటీఆర్ భూమిపూజచేశారు. అయినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.


భూమిపూజచేసి వదిలేసిన స్థలం

13 గ్రామాలకు రూ.2.60 కోట్లు

ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున 13 గ్రామపంచాయతీలకు రూ.2.60 కోట్లు మంజూరు చేస్తూ జనవరి నెల 23న డీఆర్‌డీవో సిరిసిల్ల నుంచి ఉత్తర్వులు జారీచేశారు. తంగళ్లపల్లి మండలంలో తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ తోపాటు గండిలచ్చపేట, కస్బేకట్కూర్, మండెపల్లి, ఓబులాపూర్, సారంపల్లి, తాడూర్, అంకిరెడ్డిపల్లె, అంకుషాపూర్, బాలమల్లుపల్లె, దేశాయిపల్లె, గోపాలరావుపల్లె, రామచంద్రాపూర్ గ్రామాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి.

కారణాలు అనేకం..

తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ తోపాటు గండిలచ్చపేట గ్రామంలో ఇప్పటి వరకు కనీసం తట్టెడు మట్టికూడా తీసిన దాఖలాలుకనిపించడం లేదు. పంచాయతీ భవనాల నిర్మాణాలు భూమిపూజ వరకే నిలిచిపోయాయి. గతంలో చేసిన అభివృద్ధి పనులకే బిల్లులు రావడం లేదని, ప్రస్తుతం పంచాయతీ భవనాల నిర్మాణాలు చేపడితే బిల్లులు వచ్చే అవకాశాలు లేవని, పదవీ కాలానికి చివరి ఏడాది కావడంతో చిక్కులు ఎందుకని సర్పంచులు పంచాయతీ భవనాల నిర్మాణాల జోలికి వెళ్లడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీలో మాత్రం అధిక నిధులతో మోడల్ గ్రామపంచాయతీ నిర్మాణం చేపట్టాలని పనులు పెట్టినట్లు చెబుతున్నారు.

భవనం నిర్మించాలి



మండలం ఏర్పడి దాదాపు ఆరేళ్లు గడుస్తోంది. కానీ ఇప్పటి వరకు కూడా మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ భవనం నిర్మించలేదు. అధిక నిధులతో మోడల్ గ్రామపంచాయతీ భవనం నిర్మించాలి.

– బుస్స వేణు, తంగళ్లపల్లి

పనులు ప్రారంభిస్తాం



మేజర్ గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. అధిక నిధులతో మోడల్ పంచాయతీ భవనం నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నాం.

– అంకారపు అనిత, సర్పంచ్ తంగళ్లపల్లి

నిర్మించాలని ఆదేశించాం



ఉపాధిహామీ ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే అన్ని గ్రామాల సర్పంచులను నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించాం. భవన నిర్మాణం పూర్తయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– పి.లచ్చాలు, ఎంపీడీవో, తంగళ్లపల్లి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రా మానికి చెందిన యామ రాజు గత కొన్నినెలల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం నుంచి రూ.28వేలు మంజూరు కాగా వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్ శనివారం బాధితుడికి చెక్కు అందించారు. సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ పద్మ, వార్డుసభ్యులు నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, లచ్చయ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



తంగళ్లపల్లి: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడం శోచనీయమని ఎంపీటీసీ బైరినేని రాము అన్నా రు. శనివారం అంకుషాపూర్ ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో 20 రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నారని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి సొసైటీచైర్మన్ మీనమేశాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈవిషయంపై చైర్మన్‌ను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకుల అనుమతి లభించలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే సుమారు 40 ట్రిప్పుల ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని రైతులు నష్టపోయారని, వెంటనే అంకుషాపూర్ లో ధాన్యం కొనుగోలుకేంద్రం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మ్యాదరవేని ఎల్లయ్య, పెంటల ముత్తయ్య, భూమేశ్, రమేశ్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సిరిసిల్లఅర్బన్: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పీఏ నిమ్మల అఖిలేశ్ తల్లి సుకన్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.